నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ బాలాజీ ఆస్పత్రి ఫీడర్‌లైన్ బ్యూరిఫికేషన్ పనుల నేపథ్యంలో మంగళవారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు 11కేవీ సెయింట్ ఆన్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌సీఎల్ కాలనీలో సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కుత్బుల్లాపూర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ నగేష్ అన్నారు. సోమవారం చింతల్ నగర శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో పది సంవత్సరాల పాటు పాలించిన ఫామ్ హౌస్ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని చెప్పి ఎలగ బెట్టిందేమీ లేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే రీతిలో వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రియాంక, భాగ్య నగర్ మహానగర్ సభ్యురాలు లక్ష్మి, జిల్లా గరల్స్ కన్వీనర్ ప్రసన్న, నగర కార్యవర్గ సభ్యురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట అంజయ్య నగర్‌లో బిహార్ ప్రాంతానికి చెందిన రవి కుమార్, పూనందేవి దంపతులు నివసిస్తున్నారు. ఆదివారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో పూనం దేవికి పురిటినొప్పులు రావడంతో 108 కి కాల్ చేశారు. సమయం 1.30లకు అక్కడికి చేరుకున్న 108 వాహనం ఎక్కగానే నొప్పులు ఎక్కువవ్వడంతో సిబ్బంది శ్రీకాంత్, అషిత్‌ముని వాహనంలోనే డెలివరీ చేశారు. పూనందేవిని, శిశువుని చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

సంక్షేమ సంఘాలు

అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



బ్యాంక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు కాలనీ, బస్తీల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ విప్ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ బ్యాంక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యేను కలిశారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అభినందంచి మాట్లాడారు. అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్‌గౌడ్, సలహాదారులు సర్వేశ్వర్ రావు, జగదీశ్వర్ రావు, ఉపాధ్యక్షులు మల్లేష్, రమేష్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌రావు, వెంకట్ రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

సుభాష్ నగర్ డివిజన్‌లోని ఆయిమాత దేవాలయంలో దేవాలయ 22వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్, నాయకులు రాజ్ కుమార్, లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు మంగీలాల్, ఉపాధ్యక్షులు అర్జున్ లాల్, కార్యదర్శి ప్రేమ్ పవార్, ట్రెజరర్ భావర్ లాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్య నగర్‌లోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు భూగర్భ పంపును ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం కమిటీ అధ్యక్షుడు బాబు గౌడ్, ప్రధాన కార్యదర్శి పబ్బోజు ప్రవీణ్ కుమార్, సభ్యులు రవీంద్ర చారి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి విశేష స్పందన



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: జంట సర్కిల్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 18 ఫిర్యాదులు వచ్చాయి. గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో మొత్తం తొమ్మిది ఫిర్యాదులు రాగా, కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 9 ఫిర్యాదులు వచ్చాయి. వీటిని సంబంధిత శాఖ అధికారులకు పంపించినట్లు పేర్కొన్నారు.

- ప్రజవాణి లో అన్ని శాఖల అధికారులు లేకపోవడం వల్ల ప్రజలకు ఉపయోగం ఉండదని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అధికారుల తీరుపై మండిపడ్డారు. సూరారం కాలనీలో రామలీలా మైదానం సమీపంలో గల చాచా నెహ్రూ పార్కు స్థలం కబ్జాపై ఇప్పటి వరకు స్పందన లేదన్నారు. సోమవారం మరోమారు ఉప కమిషనర్ నరసింహకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు కబ్జా కాకుండా చూడాలని, లేకుంటే సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



దుండిగల్: అక్రమ నిర్మాణాలపై దుండిగల్- గండిమైసమ్మ మండల రెవెన్యూ అధికారులు కొరడా ఝుళించారు. దుండిగల్ గ్రామంలోని పల్లవి ఆశ్రమం సమీపంలోని సర్వే నెంబరు 454లోని ప్రభుత్వ భూమిలో వెలిసిన నాలుగు బేస్‌మెంట్లను సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో జేసీబీతో కూల్చివేశారు. మరోసారి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పని, కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

నిజాంపేట్: మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, పార్కులు, ప్రభుత్వ భూములు, చెరువుల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, అనుమతుల మంజూరుపై ఫిర్యాదులు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

నిజాంపేట్: ఇందిరమ్మ కాలనీ బ్లాక్ నెంబర్ 21, 22 వెనుక ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మించిన రెండు విల్లాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ కోరారు. సోమవారం అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇందిరమ్మ కాలనీ ఫేస్ 3, బ్లాక్ నెంబర్ 21, 22 వెనుక ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 233/15ను కబ్జా చేసి సర్వే నెంబర్ 274లో పత్రాలతో పర్మిషన్ తీసుకొని అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని తెలిపారు.

ప్రాంతాల వారీగా కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న మల్లారెడ్డి

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న ముగ్గురు సబ్ రిజిస్ట్రార్‌లను ప్రాంతాలవారీగా కేటాయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి కోరారు. సోమవారం రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. క్రయవిక్రయదారులతో నిత్యం రద్దీగా ఉండే కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇటీవల ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లను కేటాయించడం స్వాగతిస్తున్నామని, వాళ్లను ప్రాంతాలవారీగా జీహెచ్ఎంసీ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్ మున్సిపల్ మూడు చోట్ల కార్యాలయం ఏర్పాటు చేసి నియమించాలని కోరారు. ముగ్గురిని కుత్బుల్లాపూర్, గండి మైసమ్మ, నిజాంపేట్ ప్రాంతాలవారీగా భవనాలు కేటాయించి నియమిస్తే స్థానికంగా ఉన్న వారికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన శ్రీశైలంగౌడ్



కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనుల విషయమై మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుని కలిశారు. అభివృద్ధి పనులకు రూ.25 కోట్ల జీహెచ్ఎంసీ నిధులు మంజూరు చేయాలని కోరారు. గతంలో ఇదే విషయంపై మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. దీనిపై స్పందించిన మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

జ్ఞాపకాలను సేకరిస్తూ చరిత్ర సృష్టించాలి

నిజాంపేట్: భవిష్యత్ దేశ నిర్మాతలు, పారిశ్రామికవేత్తల కోసం వీఎన్ఆర్ వీజేఐఈటీలో సోమవారం ఘనంగా 2025 ఆరంభ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐపీఎస్ జనరల్ సెక్రటరీ కోడె దుర్గప్రసాద్ హాజరయ్యారు. విద్యార్థులు తమ డిగ్రీకి మించి మధురమైన జ్ఞాపకాలను సేకరిస్తూ చరిత్రను సృష్టించాలన్నారు. అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్ బాబు మాట్లాడుతూ.. మంచి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు డా.డి.ఎన్.రావు, ప్రిన్సిపాల్ డా.సి.డి.నాయుడు, డైరెక్టర్ డా.చెన్నకేశవరావు, అకాడమిక్ ప్రొగ్రెషన్ డా.శివనారాయణ, డీన్ స్టూడెంట్ ప్రొగ్రెషన్ డా.టి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కె.హరీష్, చంద్ర ప్రసాద్, కోశాధికారి అజయ్ నార్నే, సభ్యులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

బాలిక అప్పగింత



బాలికను బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

జగద్గిరిగుట్ట: ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయిన బాలిక ఆచూకీ కొన్ని గంటల్లోనే పోలీసులు కనుక్కొని బంధువులకు అప్పగించారు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నర్సింహ వివరాల ప్రకారం.. ఏపీలోని గడివాడకు చెందిన ఓంకార్ స్థానికంగా సెలూన్ షాప్ నిర్వహిస్తున్నాడు. అతని భార్య 4 నెలలక్రితం చనిపోయింది. కూతురు యశస్వి(8) కూకట్‌పల్లిలోని ఆల్విన్ కాలనీ, తులసీనగర్‌లో తన బంధువుల ఇంట్లో ఉంటూ ఓ ప్రైవేట్ పాఠశాలలో 3 వతరగతి చదువుతుంది. సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లపోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాలు పరీక్షించారు. జగద్గిరిగుట్ట శ్రీనివాసనగర్ లాస్ట్ బస్టాప్‌లో 7 గంటల ప్రాంతంలో ఓ ఇంటి వద్ద ఏడుస్తూ ఉన్నట్లు తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్నవారు ఆ బాలికను.. తెలిసిన వాళ్ల ఫోన్ నెంబర్ అడగగా గుడివాడలో ఉన్న తన బంధువుల నెంబర్ చెప్పింది. వారు ఇక్కడ చింతల్ పద్మానగర్‌లో ఉన్న బాలిక పెద్దమ్మ నాగశ్రీవల్లికి ఫోన్ చేశారు. బాలికను తన పెద్దమ్మ తీసుకొని వెళ్లింది. మిస్సింగ్ అంటూ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పోలీసులు సమాచారం సేకరించి చివరికి ఆచూకీ కనుగొన్నారు. పెద్దమ్మతోనే వెళ్తానని బాలిక చెప్పడతో ఆమెకు అప్పగించారు.